క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన


ఆందోళన చేస్తున్న న్యూసాంగ్వి గ్రామస్తులు

మామడ: న్యూసాంగ్వి శివారులో అక్రమ డీ1 పట్టాలతో భూములు ఆక్రమిస్తున్నారని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. అక్రమంగా ఇచ్చిన పట్టాలు రద్దు చేయడంతోపాటు నూతన పట్టాలు ఇవ్వొద్దని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు వికాస్‌రెడ్డి, గంగాధర్, మహేశ్, రాజేందర్, లింగన్న, హరి, భూమన్న, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన


పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో గల వైకుంఠధామం పనులను అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ త్వరలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.20 లక్షల పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, డీఈ జాదవ్ సంతోష్, ఏఈ హరిభువన్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాల బంద్ విజయవంతం


నిర్మల్‌రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఏబీవీపీ కన్వీనర్ శివకుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య, నోట్ పుస్తకాలు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు దినేష్, దీపక్, జీవన్, మనోజ్, నరేందర్, నితీశ్, ఆకాశ్ పాల్గొన్నారు.
ఖానాపూర్: ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపుతో గ్రామాల్లో విద్యాసంస్థల బంద్ సంపూర్ణమైంది. విద్యారంగ సమస్యలను సర్కారు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న గోపి

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లికి చెందిన బర్ల రాజు (21) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పీచర గ్రామానికి చెందిన యువ గాయకుడు, కళాకారుడు గోపి ఆ యువకుడిని పరామర్శించారు. తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా ఫాలోవర్స్ ద్వారా వచ్చిన మొత్తం రూ.1.15 లక్షల నగదును రాజు కుటుంబీకులకు బుధవారం అందించాడు. చామన్‌పెల్లి గ్రామస్తులు గోపిని అభినందించారు.

పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ పటేల్ మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పరామర్శించారు. మాజీ సర్పంచ్ రామేశ్వర్, గోపి, శ్రీనివాస్, నవీన్, రమేశ్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఎరువులు

ముధోల్: మండలంలోని ప్రాథమిక సహకార సంఘం బిద్రెల్లి ఆధ్వర్యంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. బిద్రెల్లి, బాసర, ముధోల్ గోదాంలలో డీఏపీ రూ.1350, ముధోల్, బోరేగావ్ గ్రామాల్లోని గోదాంలో 12:32:16 రూ.1470, బాసర, కారేగావ్, అష్ట, చింతకుంట నందు గ్రోమోర్ 20:20:0:13 రూ.1100లుగా ఉన్నాయని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు తీసుకుని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

- జిల్లాలో విద్యాసంస్థల్లో అవగాహన ర్యాలీలు
- విద్యార్థులతో ప్రతిజ్ఞ


నిర్మల్‌టౌన్: ర్యాలీని ప్రారంభిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, తదితరులు

భైంసాటౌన్: యువత మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ రాజారెడ్డి సూచించారు. మత్తు పానీయాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేకదినం సందర్భంగా భైంసాలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఎస్సైలు ఎండీ గౌసుద్దీన్, షరీఫ్ ఉన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో డ్రగ్స్ వ్యతిరేక దినం నిర్వహించారు. గురుకృపా వొకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.
నిర్మల్‌టౌన్: పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి విద్యార్థులతో కలిసి జయశంకర్ చౌరస్తా మీదుగా మంచిర్యాల్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ తీశారు. డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు.. స్టాప్ ద డ్రగ్స్ అంటూ నినాదాలు చేశారు. పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.
సోన్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పోలీసులు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనతంరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై సంతోషం రవీందర్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
నర్సాపూర్(జి):నర్సాపూర్(జి), బూరుగపల్లి (జి), గొల్లమాడ గ్రామాల యువకులకు ఎస్సై హన్మాండ్లు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
కడెం: మండల కేంద్రంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.
సారంగపూర్: ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో స్వర్ణ గ్రామంలో ఎస్సై సల్ల శ్రీకాంత్ ప్రజలకు అవగాహన కల్పించారు. యువకులు డ్రగ్స్, గంజాయి కల్తీకల్లుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం కోవద్దన్నారు. సిబ్బంది ఉన్నారు.
దస్తురాబాద్: మండల కేంద్రంలోని పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎస్సై దైవాకర్, సిబ్బంది ఉన్నారు.
నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రాజలింగం, లింగాగౌడ్, ఎస్సై జ్యోతిమణి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ భీమారావు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.
లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో మత్తు పదార్థల నిషేధంపై ప్రిన్సిపాల్ తుకారాం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మోహన్‌రావు, అధ్యాపకులు వినోద్, చిన్నయ్య, శ్రీనివాస్, విఠల్ ఉన్నారు.
కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో విద్యార్థులకు ఎస్సై వి.రజనీకాంత్ అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాళ్లు బోయ సాయిలు, శ్రీనివాస్, డైరెక్టర్లు జానకిరాం, హరిప్రసాద్ పాల్గొన్నారు.
లక్ష్మణచాంద: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఎస్సై సుమలత పాల్గొన్నారు. హెచ్ఎం రాజునాయక్, ఏఎస్సై గంగాధర్, పీసీలు సంజీవ్, కిరణ్, సంతోష్ ఉన్నారు.
దిలావర్‌పూర్: దిలావర్‌పూర్‌తోపాటు గ్రామాల్లో పలు అవగాహన కార్యక్రమాల్లో ఎస్సై రాజేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.
ఖానాపూర్: పట్టణంలో విద్యార్థులతో ఎస్సై లింబాద్రి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. పోలీస్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు.


కడెం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి


సోన్‌లో ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు


లక్ష్మణచాందలో ర్యాలీలో పాల్గొన్న ఎస్సై సుమలత


దిలావర్‌పూర్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


భైంసాటౌన్: మాట్లాడుతున్న పట్టణ సీఐ రాజారెడ్డి


నిర్మల్‌ఖిల్లా: అవగాహన కల్పిస్తున్న వక్తలు


కుంటాల: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై రజనీకాంత్


సారంగపూర్: స్వర్ణ గ్రామంలో..



భవన నిర్మాణం పూర్తి చేసేదెప్పుడో!

జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో చేపట్టిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు అర్థంతరంగా నిలిచాయి. దీంతో అరకొర వసతుల మధ్య ఈ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

సికిల్‌సెల్ పరీక్షలు

భైంసాటౌన్: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సికిల్‌సెల్ (రక్తహీనత) పరీక్షలు నిర్వహించారు. స్థానిక బస్తీ దవాఖానా వైద్యులు కమలేశ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు వంద మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. సేకరించిన శాంపిళ్లను వ్యాధి నిర్ధరణ పరీక్షలకు పంపుతామన్నారు. రక్తహీనత ఉన్నవారికి తదుపరి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు సరిత, రాధిక, ఏఎన్ఎం కల్పన, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి

బాసర: మండల కేంద్రంలోని ప్రతీ బుధవారం కూరగాయల సంత వల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చూడాలని ఎస్సై గణేశ్ వ్యాపారులకు సూచించారు. వారసంతకు స్థలం లేక అటు వ్యాపారులు రోడ్లపై కూరగాయలు విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పలువురు పేర్కొన్నారు.

శిఖం భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్ వినతిపత్రం ఇస్తున్న లస్మన్న

భైంసారూరల్: శిఖం భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఏసీఎస్ వైస్ చైర్మన్ చాకెటి లస్మన్న భైంసా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. బుధవారం భైంసా మండల పరిషత్ కార్యాలయంలో శిఖం భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు. తిమ్మాపూర్‌లో ఓ వ్యక్తి రెండు ఎకరాలకుపైగా ఆక్రమించారని ఆరోపించాడు. ఇలా ఆక్రమించిన భూమికి ఫెన్సింగ్ చుట్టి తన భూమిలో కలుపుకుని పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు బీమా వెరిఫికేషన్

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) గ్రామానికి చెందిన రైతు జాదవ్ శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, రైతుబీమా వెరిఫికేషన్ పత్రాలపై ఏఈవో గణేశ్ బుధవారం నామిని సుబాభాయి వేలిముద్రలు, పత్రాలు తీసుకున్నారు. రైతు బీమా పరిహారం కింద రూ. 5 లక్షలు నామిని అకౌంట్లో జమవుతాయని పేర్కొన్నారు.

చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ ఊర చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇతర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు చెరువులో మట్టి పోయిస్తుండగా బుధవారం అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి 130 ఎకరాల చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. చెరువులో అక్రమ పట్టాలు రద్దు చేయాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎస్సారెస్పీ ముంపు భూముల్లో సాగు వద్దు


ముంపు భూములు పరిశీలిస్తున్న ఏఈఈ రవి

లోకేశ్వరం: ఎస్సారెస్పీ ముంపు భూముల్లో పంటలు సాగు వద్దని ఏఈఈ రవి అన్నారు. మండలంలోని గడ్‌చాంద సమీపంలోని ఎస్సారెస్పీ ముంపునకు గురైన భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో భూముల సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్ఐ బాలకృష్ణ, సర్వేయర్ నరేందర్, ఎంపీటీసీ సభ్యుడు జీవన్, గ్రామస్తుడు రాకేశ్ ఉన్నారు.

మొక్కలు సిద్ధంగా ఉంచాలి


నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏపీవో

తానూరు: పదో విడత హరితహారానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. హిప్నెల్లి గ్రామంలో బుధవారం నర్సరీ మొక్కలను పరిశీలించారు. సర్కారు బడులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటేందుకు కూలీలతో గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారిద్దాం

- ఎమ్మెల్యే రామారావుపటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: పల్లె అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిద్దామని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. ఎంపీపీ అబ్దుల్ రజాక్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే వర్షాకాలంలో పల్లెల్లో పారిశుధ్యంపై దృష్టిసారించాలన్నారు. అన్ని శాఖల అధికారులు గ్రామీణుల సమస్యలు పరిష్కరించాలన్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు దెబ్బతిందని గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుత ఇరిగేషన్ మంత్రి దగ్గరికి పలుమార్లు వెళ్లడంతో రూ.9 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఆరునెలల్లో ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత, డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్ల వ్యవస్థ బాగుండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమావేశంలో సభ్యులు పలు అంశాలను ప్రస్తావించగా ప్రమాదవశాత్తు ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ కనెక్షన్లను ఇవ్వాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్న తరుణంలో ఐదేళ్లపాటు సేవలందించిన వారిని అభినందించారు. సమావేశంలో జెడ్పీటీసీ దీప సొలంకిభీంరావు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సారెడ్డి పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి

సారంగపూర్: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆడె సవితాబాయి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఏవో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని తెలిపారు. కల్తీ విత్తనాలు, ఎరువులు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అనంతరం మండల ప్రజలకు అవసరమైన సాగు సలహాలు, సూచనలు అందించడానికి గాను గ్రామాల్లో ఏఈవోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు సాగునీటి విడుదల అంశంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలు లేనిచోట కొత్తవి ఏర్పాటు చేయాలని, కోతలు లేకుండా సరఫరా చేయాలని ఏఈ సాయికిరణ్ సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, కౌట్ల(బి) పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం
వచ్చేనెల 3వ తేదీ నుంచి ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో ఇదే వారికి చివరి సమావేశం కావడంతో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డిలను సన్మానించారు. కార్యాలయం సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు జెడ్పీ చైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్లపాటు ప్రజలకు సేవచేసే అదృష్టం కల్పించినందుకు జెడ్పీటీసీ సభ్యులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశ్నిస్తే ప్రజాప్రతినిధులపై కేసులా?

- కుంటాల మండల సమావేశం బహిష్కరణ


సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు

కుంటాల: బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని వైద్యురాలిని ప్రజాప్రతినిధిగా ఎంపీపీ అప్క గజ్జారాం ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడం ఏంటని సభ్యులు ప్రశ్నించారు. బుధవారం జరగాల్సిన కుంటాల మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు. మొదటగా ఓలా ఎంపీటీసీ కట్ట రవి మాట్లాడుతూ రైతువేదికలో ఈనెల 13న సీజనల్ వ్యాధులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీపీ అప్క గజ్జారాం వైద్యురాలు శృతిరెడ్డిని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. వైద్యురాలు అక్రమంగా కేసు నమోదు చేయడం ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించారని అన్నారు. వైస్ ఎంపీపీ మౌనిక, ఎంపీటీసీలు సుధాకర్, కవిత, మధుకర్, కోఆప్షన్ మెంబర్ ఎస్కే గౌస్‌లు ఎంపీపీకి మద్దతు తెలిపి సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. కోరం ఉన్న సభ్యులు సమావేశాన్ని బహిష్కరించడంతో సభ ముందుకు సాగలేదని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి


నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బీసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిజర్వేషన్ల పితామహుడు, ఛత్రపతి సాహు మహారాజ్ 148వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి, ప్రజా సంఘాల నాయకులు, నరేందర్, దత్తురాం, సుదర్శన్‌రెడ్డి, నవీన్, రాజు, చందు, సూర్య పాల్గొన్నారు.

కడెం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శంకర్

కడెం: కడెం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జాదవ్ శంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన సుజాత సెలవుపై వెళ్లడంతో, ఆమె స్థానంలో డీటీగా పనిచేస్తున్న శంకర్ బాధ్యతలు స్వీకరించారు.